# పెన్ పవర్

10 YEAR ANNIVERSARY 2014 - 2024

## తెలంగాణ రౌండప్

సోమవారం | 24 ఫిబ్రవరి 2025 | పేజీలు 8




### తెలంగాణలో కొత్త మద్యం బ్రాండ్లు..

# అప్లికేషన్లకు గ్రీన్ సిగ్నల్

**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణలో కొత్త మద్యం బ్రాండ్లకు తెలంగాణ బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ దరఖాస్తులు ఆహ్వానించింది. ఎలాంటి ఆరోపణలు లేని కంపెనీలు దరఖాస్తులు చేసుకోవచ్చని ప్రకటన చేసింది. దరఖాస్తు చేసుకునే కంపెనీలపై ఎలాంటి ఆరోపణలు లేవనే హామీ పత్రాన్ని ఇవ్వాల్సి ఉంటుందని చెప్పింది. వచ్చిన దరఖాస్తులను ఆన్ లైన్లో పెట్టి.. ప్రజల నుంచి ఫిర్యాదులు సేకరించనున్నారు.. వచ్చిన ఫిర్యాదుల ప్రకారం.. కొత్త బ్రాండ్ కంపెనీకి అనుమతి ఇవ్వాలా వద్దా అనేదానిపై నిర్ణయం తీసుకోనున్నారు బేవరేజెస్. తెలంగాణ ఎక్సైజ్‌శాఖ, తెలంగాణ బేవరేజేస్ కార్పొరేషన్ 2024లో కొత్త మద్యం బ్రాండ్లకు అనుమతించినా, విమర్శలు రావడంతో వెంటనే వెనక్కి తీసుకుంది. కానీ ఇప్పుడు కంపెనీలకు ప్రత్యేక విధానంలో పర్మిషన్లు ఇస్తోంది. గతంలో అనుమతులు ఇచ్చిన కంపెనీల్లో టాయిట్ బ్రూవరీస్ ప్రైవేట్ లిమిటెడ్, ఎక్సోటికా లిక్కర్ ప్రైవేట్ లిమిటెడ్, మౌంట్ ఎవరెస్ట్ లిమిటెడ్, లీలాసన్స్ ఆల్కా బేవ్ ప్రైవేట్ లిమిటెడ్, సోం డిస్టిలరీస్ అండ్ బేవరేజెస్ ఉన్నాయి. ఇందులో సోమ్ డిస్టిలరీస్ నుంచి పవర్1000, బ్లాక్ ఫోర్ట్, హంటర్, వుడ్ పికర్ బీర్లు అందుబాటులో ఉన్నాయి. ప్రస్తుతం యునైటెడ్ బ్రూవరీస్‌నుంచే దాదాపు 70 శాతం బీర్లు రాష్ట్రవ్యాప్తంగా సప్లై అవుతున్నాయి.

**బీర్ల ధరలు పెంపు**

ఫిబ్రవరి 10న తెలంగాణ ప్రభుత్వం బీర్ల ధరలను 15 శాతం పెంచిన సంగతి తెలిసిందే. ఒక్క బీర్ల కేస్ మీద 15 శాతం బేసిక్ ధర పెంచితే, దానికి కనీసం రూ. 250 నుంచి -2 లో




ప్రమాదంలో నుజ్జునుజ్జు అయిన కారు..

## తెలంగాణ ఉపాధ్యాయుడికి

# మోదీ ప్రశంస



- గిరిజన భాషల పరిరక్షణకు తొడసం కైలాష్ సాయం
- ఏఐతో 'కొలామి'లో సాంగ్ కంపోజ్
- మన్ కీ బాత్‌లో అభినందించిన ప్రధాని మోదీ

-2 లో

# యాక్సిడెంట్‌లో.. వ్యక్తి మృతి..

- దుండిగల్ పియస్ పరిధి బౌరంపేట్ స్నేక్‌పార్క్ వద్ద కారు, టిప్పర్ ఢీకొని కారు డ్రైవర్ దుర్మరణం..
- దూలపల్లి గ్రామానికి చెందిన పున్నాల నాగవంశీ (22) అక్కడికక్కడే కారులోనే మృతి..
- కారు వెనుక నుండి బైకుపై వస్తున్న వెంకట సురేంద్ర కాలుకు తీవ్ర గాయాలు..

**దుండిగల్, పెన్ పవర్, ఫిబ్రవరి 23:** ఒక ప్రమాదంలో మూడు వాహనాలు ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి అక్కడికి అక్కడే మృతి చెందగా మరో వ్యక్తికి తీవ్ర గాయాలు అయ్యాయి.. ఈ సంఘటన దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.. ఇన్‌స్పెక్టర్ సతీష్ తెలిపిన వివరాల ప్రకారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దూలపల్లి గ్రామానికి చెందిన పున్నాల నాగవంశీ (22) ఓ ప్రైవేట్ ఉద్యోగి.. ఆదివారం ఉదయం సుమారు 06:45 గంటలకు మియాపూర్ నుంచి గండిమైసమ్మవైపు కారులో బయలు దేరాడు.. బౌరంపేట్ స్నేక్ పార్క్ వద్దకు రాగానే గండిమైసమ్మ నుండి ప్రగతి నగర్‌కు వెళ్తున్న టిప్పర్ వేగంగా వచ్చి కారును ఢీ కొట్టింది. దీంతో కారు ముందు భాగం నుజ్జు నుజ్జు అయింది..దీంతో కారు డ్రైవింగ్ చేస్తున్న పున్నాల నాగవంశీ, అక్కడికి అక్కడే మృతి చెందాడు.. అదేసమయంలో కారు వెనక నుండి మరో బైక్ ఢీ కొనడంతో బాచుపల్లికి చెందిన చిట్టూరి వెంకట సురేంద్ర కాలుకు తీవ్ర గాయాలై. చికిచ్చ నిమిత్తం సూరారంలో మాల్లారెడ్డి ఆసుపత్రికి తరలించారు.. దుండిగల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌ఓ సీఐ పి.సతీష్ తెలిపారు..

## నేటి నుంచి కీసర గుట్ట జాతర..

## 1100 మంది పోలీసులతో బందోబస్తు



**హైదరాబాద్ పెన్ పవర్:**మేడ్చల్ జిల్లా కీసర గుట్ట శ్రీ భవాని రామలింగేశ్వర స్వామి దేవస్థానం మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా కీసరగుట్టలో ఫిబ్రవరి 24 నుంచి మార్చి 1 వరకు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. ఫిబ్రవరి 24న ఉదయం గణపతి హెూమంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభం అవుతాయి. బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కావలసిన ఏర్పాట్లు చేసిన అధికారులు. ఎండలు ఎక్కువగా ఉండడం వలన క్యు లైన్లో ఉండే భక్తుల కోసం -2 లో

## కాంగ్రెస్, బీఆర్ఎస్

## రెండు పార్టీలు ఒక్కటే



**హైదరాబాద్ పెన్ పవర్:** కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండు పార్టీలు ఒక్కటేనని కేంద్రమంత్రి బండి సంజయ్ విమర్శించారు. ఆదివారం (ఫిబ్రవరి 23) మంచిర్యాల జిల్లా మందమర్రి మండలంలో బండి సంజయ్ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కృష్ణా జలాలను పక్క రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ తరలించుకుపోతుంటే తెలంగాణ రైతాంగాన్ని వరి వేయొద్దని రేవంత్ రెడ్డి ప్రభుత్వం అనడం సిగ్గుచేటని విమర్శిం చారు. గతంలో కేసీఆర్ వరి వేస్తే ఉరి అంటే.. ఇప్పుడు వరి వెయ్యొద్దని అనడం రేవంత్ రెడ్డి ప్రభుత్వం అసమర్థ పాలనకు నిదర్శనమన్నారు.ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ పార్టీకి అభ్యర్థులే లేరని ఎద్దేవా చేశారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్ మెంట్ చెల్లించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. ఎన్నికల్లో -2 లో

# ఎస్ఎల్ బీసీ టన్నెల్ ప్రమాదం: రాత్రికి శ్రీశైలం చేరుకోనున్న నేవీ బృందం

**హైదరాబాద్ పెన్ పవర్:**నాగర్ కర్నూలు జిల్లా దోమలపెంట వద్ద ఎస్ఎల్బీసీ టన్నెల్ పైకప్పు కూలిపోవడం తెలిసిందే. ఈ ఘటనలో ఎనిమిది మంది టన్నెల్ లో చిక్కుకుపోయారు. నిన్న ఉదయం నుంచి వారు అందులోనే ఉండిపోవడంతో, ఇప్పుడు వారి పరిస్థితి ఎలా ఉందన్నది అత్యంత ఆందోళన కలిగిస్తోంది. ఈ నేపథ్యంలో, సాధ్యమైనంత వేగంగా రెస్క్యూ ఆపరేషన్ ను ముందుకు తీసుకెళుతున్నారు. ఈ సాయంత్రానికి టన్నెల్ కూలిపోయిన ప్రాంతానికి 50 మీటర్ల దూరం వరకు సహాయక బృందాలు వెళ్లగలిగాయి. భారీగా మట్టి, బురద ఉండడంతో సహాయక చర్యలకు అంతరాయం కలుగుతోంది. ఘటన



స్థలంలో 15 అడుగుల ఎత్తు వరకు బురద పేరుకుపోయినట్టు తెలుస్తోంది.

కాగా, సహాయక చర్యల్లో పాలుపంచుకునేందుకు నేవీ బృందం కూడా వస్తోంది. రెస్క్యూ ఆపరేషన్ నిపుణులతో కూడిన నేవీ టీమ్ ఈ రాత్రికి శ్రీశైలం చేరుకోనుంది.

ప్రస్తుతం మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు ఘటన స్థలంలో సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు.

# జంట జలాశయాలను కలపనున్న గోదావరి



**హైదరాబాద్ పెన్ పవర్:** వందేళ్ల క్రితం కృష్ణానది ఉపనదులైన మూసీ, ఈసీలపై హైదరాబాద్ సమీపంలో నిర్మించిన ఉస్మాన్‌సాగర్, హిమాయత్ సాగర్ జంట జలాశయాలు గోదావరి జలాలతో అనుసంధానం కానున్నాయి. హైదరాబాద్ మహానగర ప్రజల దాహార్తిని తీర్చేందుకు ప్రతిపాదించిన గోదావరి 2, 3 దశల ప్రాజెక్టులో భాగంగా ఈ జంట జలాశయాల మధ్య 4.5 కి.మీ. కాలువను రాష్ట్ర ప్రభుత్వం నిర్మించనుంది. దీని ద్వారా కృష్ణా ఉపనదులు గోదావరితో అనుసంధానం కానున్నాయి. మూసీ పునరుజ్జీవంలో భాగంగా జలమండలి ఈ ప్రాజెక్టును ప్రతిపాదించింది. ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్‌లు ఇప్పటికీ అతితక్కువ వ్యయంతో పూర్తి గ్రావిటీతో నగరానికి రోజుకు 45 ఎంజీడీల తాగునీటిని అందిస్తున్నాయి. ఈ రెండింటి మధ్య అనుసంధానం కీలకమని దశాబ్దాల క్రితమే భావించారు. 1988లోనే హిమాయత్‌సాగర్ నుంచి ఉస్మాన్‌సాగర్‌కు ప్రత్యేకంగా రెండు వరుసల పైపులైన్‌ను కూడా నిర్మించారు. అయితే, ఇది పూర్తిస్థాయిలో వినియోగంలోకి రాలేదు. తాజాగా 4.5 కి.మీ. కాలువ నిర్మాణానికి పూనుకున్నారు.

### అనుసంధానంతో పునరుజ్జీవం

గోదావరి 2, 3 దశలను రూ.7,360 కోట్లతో చేపడుతున్నారు.

ఇందులో మూడో కాంపొనెంట్‌గా హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్‌ల మధ్య అనుసంధానంతోపాటు రెండు జలాశయాల వద్ద వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ల ఏర్పాటుకు రూ.300.09 కోట్లు వ్యయం చేయనున్నారు.

ఇందులో భాగంగా ఉస్మాన్‌సాగర్ వద్ద 120 ఎంఎల్‌డీలు, హిమాయత్‌సాగర్ వద్ద 70 ఎంఎల్‌డీల సామర్థ్యంతో నీటిశుద్ధి ప్లాంట్లు ఏర్పాటుకానున్నాయి.

మొదటగా గోదావరి జలాలను హిమాయత్‌సాగర్‌కు తరలించి, అక్కడి నుంచి కొత్తగా నిర్మించే కాలువ ద్వారా ఉస్మాన్‌సాగర్(గండిపేట)కు తరలిస్తారు.

గోదావరి 2, 3 దశల ద్వారా మొత్తం 20 టీఎంసీల గోదావరి జలాలను తరలించనుండగా ఇందులో 15 టీఎంసీలను ఘన్‌పూర్ వద్ద శుద్ధి చేసి జలమండలి పరిధిలో తాగునీటికి సరఫరా చేస్తారు.

మరో ఐదు టీఎంసీలను మూసీ పునరుజ్జీవానికి తరలిస్తారు. ఇందులోనూ 2.5 టీఎంసీలను అత్యవసర పరిస్థితుల్లో నగరంలో తాగునీటి అవసరాలకు ఉపయోగించేలా ప్రాజెక్టును ప్రతిపాదించారు.

ప్రస్తుతం జంట జలాశయాల నీటిని ఆసిఫ్‌నగర్ ఫిల్టర్‌బెడ్‌లకు తరలించి శుద్ధి చేసిన అనంతరం సరఫరా చేస్తున్నారు. తాజాగా ప్రాజెక్టులో శుద్ధి చేసిన జలాలనే నేరుగా ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్‌ల వద్ద నుంచి తరలించేలా ప్రతిపాదించారు.

## తెలంగాణ ఉపాధ్యాయుడికి మోదీ ప్రశంస

**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణలో ఓ ఉపాధ్యాయుడి కృషిని ప్రధాని మోదీ ప్రత్యేకంగా అభినందించారు. కృత్రిమ మేధ (ఏఐ) టెక్నాలజీని వినియోగించుకొని దేశాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలని పేర్కొన్నారు. అంతరిక్ష రంగంలో ఏటా పురోగతి సాధిస్తున్నామన్నారు. ఇస్రో 100వ రాకెట్ ప్రయోగాన్ని విజయవంతంగా పూర్తిచేయడం దేశానికే గర్వకారణం అని కొనియాడారు. ప్రతి నెలా చివరి ఆదివారం నిర్వహించే 'మన కీ బాత్'లో మోదీ మాట్లాడారు. 'ఇటీవల ఏఐ సదస్సులో పాల్గొనేందుకు పారిస్ వెళ్లాను. ఏఐలో భారత్ సాధించిన పురోగతిని ప్రపంచం ప్రశంసించింది. తాజాగా తెలంగాణ ఆదిలాబాద్ లోని సర్కాస్ స్కూల్స్ లో పనిచేసే ఉపాధ్యాయుడు తొడసం కైలాష్ గిరిజన భాషలను పరిరక్షించడంలో మాకు సాయం చేశారు. ఏఐ సాధనాలను ఉపయోగించి కొలామి భాషలో పాటను కంపోజ్ చేశారు. జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని వారి జీవితాల్లో స్ఫూర్తి నింపేందుకు ఒక రోజు తన సోషల్ మీడియా ఖాతాను వారికే అంకిత చేస్తం..' అని మోదీ తెలిపారు.

## తెలంగాణలో కొత్త మద్యం బ్రాండ్లు.. అప్లికేషన్లకు గ్రీన్ సిగ్నల్

- మొదటి పేజి తరువాయి

రూ. 280 వరకు వ్యాట్, ఎక్సైజ్ సుంకంతో పాటు వివిధ రకాల పన్నులు జత కలుస్తాయి. దీంతో రూ.150 ఉన్న లైట్ బీరు రూ.180 వరకు, రూ.160 ధర ఉన్న స్ట్రాంగ్ బీరు ధర రూ.200 వరకు పెరిగింది. అంటే తెలంగాణలో ఒక్కో లైట్ బీర్ పై 30 రూపాయలు, స్ట్రాంగ్ బీరుపై 40 రూపాయలు ధర పెరిగింది

## కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండు పార్టీలు ఒక్కటే

- మొదటి పేజి తరువాయి

హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ఆటకెక్కించిందని విమర్శించారు. కేసీఆర్, కేటీఆర్ లు ప్రజా సంపదను లూటీ చేస్తే ఇప్పటి వరకు కూడా అరెస్టులు చేయకుండా కాలయాపన చేయడం కాంగ్రెస్ పార్టీకి సిగ్గుచేటని ఘాటు వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ కాంగ్రెస్ పార్టీకి ఓ ఏటీఎం లాగా మారిందని అన్నారు. కేసీఆర్ అహంకారంతో వ్యవహరించడం వల్లనే ప్రజలు బుద్ధి చెప్పి ఫాం హౌస్‌లో కూర్చోబెట్టారన్నారు. సింగరేణి సంస్థను ప్రైవేటీకరణ చేస్తారని బీజేపీపై తప్పుడు ఆరోపణలు చేసింది బీఆర్ఎస్ పార్టీయేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పదేళ్ల హయాంలో కేసీఆర్ ఓ నియంత లాగా వ్యవహరించి ప్రశ్నించే నాయకులను అడ్డుకుని తప్పుడు కేసులతో జైల్లో పెట్టించాడని అన్నారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వచ్చి గోల్కొండ కోట మీద కాషాయ జెండా ఎగరాలంటే పార్టీ శ్రేణులు కసితో పని చేయాలని పిలుపునిచ్చారు బండి సంజయ్.

## నేటి నుంచి కీసర గుట్ట జాతర.. 1100 మంది పోలీసులతో బందోబస్తు

- మొదటి పేజి తరువాయి

చల్వ పందిర్లు మంచినీరు మజ్జిగ ఏర్పాటు చేయనున్నారు ఆలయ అధికారులు. లైన్ లో వచ్చే సామాన్య ప్రజలకు సులువుగా దర్శనమయ్యే విధంగా కావలసిన బారికేడ్లు అలాగే ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా ఆలయం చుట్టూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు పోలీసులు. నగరానికి దగ్గరలో కీసర గుట్ట ఉన్న నేపథ్యంలో చాలా వరకు భక్తులు స్వామి వారి దర్శనం కోసం వచ్చే అవకాశం ఎక్కువగా ఉందని కుషాయిగూడ ఎసిపి మహేష్ కుమార్ అన్నారు. సుమారు 11 వందల మంది పోలీసులు ఈ బ్రహ్మోత్సవాల్లో పాల్గొననున్నారని చెప్పారు. హైదరాబాద్ నగరంలోని పలు చోట్ల నుంచి కీసరగుట్టకు 270 ప్రత్యేక ఆర్టీసీ బస్సులు నడవనున్నాయి

# ట్రంప్, మోదీ ప్రజాస్వామ్యానికి ముప్పా?.. ఇటలీ ప్రధాని మెలోనీ కామెంట్స్..



హైదరాబాద్ పెన్ పవర్:ఇటలీ ప్రధాని జార్జియో మెలోని ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశారు.అమెరికా అధ్యక్షుడు, ప్రధాని మోదీ, నేను మాట్లాడుతుంటే మమ్ములను ప్రజాస్వామ్యానికి ముప్పు అంటున్నారెందుకు అని జార్జియో మెలోని ప్రశ్నించారు. వలసను నియంత్రించడం, వాక్ స్వాతంత్ర్యాన్ని సమర్థించడం తప్పా అని అన్నారు. ఇంతకీ మెలోనీ ఆసక్తికర వ్యాఖ్యలను ఎక్కడ అన్నారు.. ఎవరిని ఉద్దేశించి అన్నారో వివరాల్లోకి వెళితే..

ఫిబ్రవరి 22,2025న వాషింగ్టన్ డీసీలో కన్జర్వేటివ్ పొలిటికల్ యాక్షన్ కాన్ఫరెన్స్ (%ఙూాజ%) జరిగింది. ఈ సమావేశంలో మాట్లాడిన ఇటలీ ప్రధాని జార్జియో మెలోని వామపక్షాలపై తీవ్రంగా విరుచుకుపడ్డారు. వాక్ స్వాతంత్ర్యం, వలసల నియంత్రణ వంటి సాంప్రదాయవాద అంశాల ప్రాముఖ్యతను స్పష్టం చేశారు. మెలోని ప్రసంగానికి సంబంధించిన వీడియో ఫిబ్రవరి 22శనివారం బయటికొచ్చింది. ఈ వీడియోలో మెలోనీ మాట్లాడుతూ.. బిల్ క్లింటన్, టోని బ్లెయర్ వంటి వారు 1990లలో ప్రపంచ వామపక్ష ఉదారవాద నెట్ వర్క్ ను సృష్టించినప్పుడు వారిని రాజనీతజ్ఞులు అన్నారు. ఇవాళ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, మెలోని, ప్రధాని మోదీ మాట్లాడినప్పుడు వారిని ప్రజాస్వామ్యానికి ముప్పుగా ఎందుకు పరిగణిస్తున్నారని క్వశ్చన్ చేశారు. యూరప్ రాజకీయాల్లో సంప్రదాయ వాదులు పెరుగుతూనే ఉన్నారు. వారు ప్రతిభావంతులవుతున్నారు. అందుకే వామపక్షాలు ఆందోళన చెందుతున్నాయి. ట్రంప్ విజయం వారికి చికాకు కలిగిస్తుంది. వారికి హిస్టిరియాగా మారింది. అంతేకాదు సంప్రదాయ వాదులు ఇప్పుడు ప్రపంచానికి సహకరిస్తున్నారు కాబట్టి వామపక్షాలకు చికాకు తెప్పిస్తోందన్నారు మెలోని.

ఇంతకీ CPAC అంటే.. ఎందుకది?

CPAC వెబ్ సైట్ ప్రకారం.. 1964లో CPAC స్థాపించబడింది.అమెరికాలో మొదటి సంప్రదాయవాద సంస్థ. ప్రతి అమెరికన్ జీవిత విలువలు, స్వేచ్ఛ, ఆస్తి రక్షణకు ఇది వాచ్ డాగ్. 2025, ఫిబ్రవరి 19నుంచి 22 వరకు దేశ రాజధాని వాషింగ్టన్ లో జరిగిన ప్రపంచ అత్యంత, అతిపెద్ద సంప్రదాయవాదుల సమావేశం.

# నెత్తిన జీలకర్ర బెల్లం.. కాళ్లకు పారాణి.. పెళ్లి బట్టలతోనే గ్రూప్ 2 ఎగ్జామ్‌కు



హైదరాబాద్ పెన్ పవర్:పెళ్లి బట్టలు.. నెత్తిపై జీలకర్ర బెల్లం.. కాళ్లకు పారాణి.. ఇలా పెళ్లి మండపంలో ఉండాల్సిన ఓ నూతన వధువు పరీక్ష కేంద్రంలో దర్శనమిచ్చింది. దీంతో ఏం జరుగుతుందో తెలియక అక్కడున్నవారంతా షాక్ అయ్యారు. పెళ్లి బట్టల్లో ఉన్న యువతి పరీక్ష కేంద్రానికి ఎందుకు వచ్చిందని ఎగ్జామ్ సెంటర్ సిబ్బంది బిత్తరపోయారు. తీరా చూస్తే ఆ కొత్త పెళ్లి కూతురు గ్రూప్ 2 పరీక్ష రాయడానికి వచ్చిందని కాసేపటికి అర్థమైంది. ఈ ఘటన ఆంధ్రప్రదేశ్ గ్రూప్ 2 పరీక్ష సందర్భంగా చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. రాష్ట్రవ్యాప్తంగా ఆదివారం (ఫిబ్రవరి 23) ఏపీలో గ్రూప్ 2 పరీక్ష జరిగింది.

ఈ గ్రూప్ 2 పరీక్షకు మమతా అనే యువతి కూడా అప్లై చేసుకుంది. అయితే.. గ్రూప్ 2 పరీక్ష రోజే మమతా పెళ్లి నిశ్చయమైంది. ఆదివారం ఉదయం 6 గంటల ప్రాంతంలో చిత్తూరులో మమతా వివాహం చేసుకున్నది. పెళ్లి చేసుకున్నప్పటికీ ఏళ్ల పాటు కష్టపడి చదవిన గ్రూప్ 2 పరీక్షకు మమతా హాజరైంది. ఆదివారం (ఫిబ్రవరి 23) ఉదయం పెళ్లి అనంతరం సరిగ్గా ఎగ్జామ్ సమయానికి పరీక్ష కేంద్రానికి వచ్చి పరీక్ష రాసింది మమతా. పెళ్లి బట్టలు, నెత్తిపై జీలకర్ర బెల్లం, కాళ్లకు పారాణితోనే మండపం నుంచి నేరుగా తిరుపతి పద్మావతి మహిళా డిగ్రీ కాలేజీ సెంటర్‌కు వచ్చి పరీక్ష రాసింది కొత్త పెళ్లి కూతురు మమతా. పెళ్లి బట్టల్లోనే మమతా ఎగ్జామ్ సెంటర్‌కు రావడం అక్కడున్న వారిని ఆకట్టుకుంది. దీంతో మమతా డెడికేషన్‌ని పలువురు కొనియాడాతున్నారు. అటు పెళ్లి.. ఇటు పరీక్ష రెండింటిని ఒకేరోజే మ్యానేజ్ చేయడంతో కొత్త పెళ్లి కూతురుని అభినందిస్తున్నరు. గవర్నమెంట్ జాబ్ కు ఉండే పవర్ అలాంటిది మరీ అని మరికొందరు కామెంట్లు చేస్తున్నారు.

# రేవంత్ రెడ్డికి ఫోన్ చేసిన రాహుల్ గాంధీ

- ఎస్ఎల్బీసీ ప్రమాదంపై ఆరా తీసిన రాహుల్ గాంధీ
- సహాయక చర్యల గురించి రాహుల్ కు వివరించిన రేవంత్
- దాదాపు 20 నిమిషాల పాటు మాట్లాడుకున్న నేతలు



హైదరాబాద్ పెన్ పవర్:తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ఫోన్ చేశారు. ఎస్ఎల్బీసీ సొరంగ మార్గంలో చోటు చేసుకున్న ప్రమాదంపై ఆయన ఆరా తీశారు. ఈ ప్రమాదంలో ఇద్దరు ఇంజినీర్లు, ఇద్దరు ఆపరేటర్లు, నలుగురు కూలీలు ఇరుక్కుపోయిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో బాధితులను రక్షించేందుకు జరుగుతున్న చర్యలపై రాహుల్ ఆరా తీశారు. దాదాపు 20 నిమిషాల పాటు ఇద్దరూ మాట్లాడుకున్నారు. సహాయక సిబ్బంది చేపడుతున్న చర్యలను రాహుల్ కు రేవంత్ వివరించారు.బాధితులను రక్షించేందుకు సహాయక సిబ్బంది సొరంగంలో 13.5 కిలోమీటర్ల లోపల వరకు వెళ్లారు. మరో అర కిలోమీటరు వెళ్లాల్సివుండగా మట్టి, నీటి కారణంగా అడ్డంకులు ఏర్పడ్డాయి. ఈ అడ్డంకులను అధిగమించి ప్రమాద స్థలికి వెళ్లేందుకు సహాయక సిబ్బంది ప్రయత్నిస్తున్నారు.

# ఎస్ఎల్ బీసీ ప్రమాదం మానవ తప్పిదం కాదు: మంత్రి జూపల్లి



హైదరాబాద్ పెన్ పవర్:నాగర్ కర్నూలు ఎస్ఎల్ బీసీ ప్రమాదంలో చిక్కుకున్న 8 మంది కార్మికుల కోసం రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతోంది. ఎన్డీఆర్ఎఫ్ బృందాల సహాయక చర్యలు చేపట్టారు. ఉత్తరాఖండ్ టెక్నికల్ టీమ్ ను రప్పించేందుకు సిద్ధమవుతున్నారు అధికారులు. సీఎం రేవంత్ రెడ్డి ఎప్పటికప్పుడు మంత్రులను అడిగి సమాచారం తెలుసుకుంటున్నారు . మంత్రులు ఉత్తమ్,జూపల్లి ఎప్పటికప్పుడు అధికారులు,రెస్క్యూ టీంతో మాట్లాడుతున్నారు.

రెస్క్యూ టీంతో టన్నెల్ లోపలికి వెళ్లారు మంత్రి జూపల్లి దాదాపు 13కి.మీ వరకు లోపలికి వెళ్లారు. ఇంకో అర కిలోమీటర్ వెళ్లాల్సి ఉండగా..మట్టి నీరు ఉండటంతో వెనక్కి వచ్చారు. టన్నెల్ లో పైకప్పు కూలడంతో 12 ఫీట్ల మేర మట్టి బురద చేరుతోందన్నారు మంత్రి జూపల్లి. రెస్క్యూ టీం ఇంకా ముందుకు వెళ్లేందుకు ప్రయత్నం చేస్తున్నారని చెప్పారు.టన్నెల్లో చిక్కుకున్న కార్మికులను కాపాడుతామని మంత్రి ఉత్తమ్ అన్నారు. 8 మందిని సురక్షితంగా బయటకు తెచ్చేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నామని చెప్పారు.మరో వైపు ఎస్ఎల్ బీసీ ప్రమాదంపై రాహుల్ గాంధీ సీఎం రేవంత్ రెడ్డికి ఫోన్ చేశారు. ఇద్దరు నేతలు దాదాపు 20 నిమిషాలు మాట్లాడుకున్నారు.

# పగటిపూటనే దొంగతనాలు.. ఈ వెరైటీ దొంగ క్రైం కథ ఇదీ



హైదరాబాద్ పెన్ పవర్:దొంగతనాలంటే సాధారణంగా రాత్రి వేళల్లోనే జరుగుతాయనుకుంటాం. చీకట్లో, ఎవరూ గమనించని సమయంలో దొంగలు తమ పని తీరుస్తారు. కానీ బెంగళూరుకు చెందిన ఓ దొంగ మాత్రం అందరి కంటే భిన్నం. "నా రూటే సపరేటు!" అంటూ దొంగతనాలను రాత్రి కాకుండా పగటి పూటలోనే చేసే వెరైటీ దొంగ సుహాన్ ఖాన్ చివరకు పోలీసుల చేతిలో చిక్కాడు.

**పక్కా ప్లాన్ తో దొంగతనాలు**

సుహాన్ ఖాన్ తన దొంగతనాలకు ముందుగా పూర్తిగా పరిశీలన జరిపి, ఇంట్లో ఎవరూ లేని సమయాన్ని ఖచ్చితంగా అంచనా వేసేవాడు. ఈ తరహాలో ఇప్పటికే తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటకలో కూడా పలు దొంగతనాలు చేశాడు. అతడు కేవలం నగలు, డబ్బును దొంగిలించడం మాత్రమే కాకుండా, తన దొంగతనానికి మరొక మెరుగులు దిద్దాడు. దొంగిలించిన బంగారాన్ని కరిగించి, బంగారు బిస్కెట్లుగా మార్చి విక్రయించే పద్ధతిని అవలంబించాడు.

**పెనుకొండ దొంగతనంతో అసలు మర్మం బయటకు..**

ఇటీవల శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండలోని నారాయణమ్మ కాలనీలో జనవరిలో జరిగిన ఓ భారీ దొంగతనం కేసులో పోలీసులు విచారణ చేపట్టారు. ఆ దొంగతనంలో దాదాపు 470 గ్రాముల బంగారం మాయం కాగా, బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో భాగంగా పోలీసులు నిందితుడిని వెతుకుతుండగా, ఫిబ్రవరి 13న కర్ణాటక రాష్ట్రం తుమ్మకూరు వద్ద సుహాన్ ఖాన్‌ను అదుపులోకి తీసుకున్నారు.

**రేచీకటి సమస్యతో వెరైటీ దొంగతనం!**

పోలీసులు సుహాన్ ఖాన్‌ను విచారించగా, తనకు రేచీకటి సమస్య ఉందని తెలిపాడు. అందుకే రాత్రివేళ దొంగతనాలు చేయడం తనకు కుదరదని, అందుకే పగటి పూటల్లోనే తన పని ముగించేస్తాడని ఒప్పుకున్నాడు. తాను దొంగతనానికి పాల్పడిన బంగారాన్ని కరిగించడానికి ప్రత్యేకంగా ఆన్‌లైన్‌లో మెటీరియల్స్ కొనుగోలు చేసినట్లు కూడా పోలీసుల విచారణలో వెల్లడయ్యింది.

**29 లక్షలకు బంగారం విక్రయం**

పెనుకొండలో దొంగిలించిన 470 గ్రాముల బంగారాన్ని బిస్కెట్లుగా మార్చి దాదాపు రూ.29 లక్షలకు విక్రయించినట్లు పోలీసులు గుర్తించారు. అంతేకాదు ఫిబ్రవరి 3న చిత్తూరు జిల్లా కుప్పం ప్రాంతంలో కూడా మరో ఇంట్లో బంగారం దొంగిలించినట్లు అంగీకరించాడు. పోలీసులు నిందితుడి వద్ద నుండి 350 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. సుహాన్ ఖాన్‌పై పలు కేసులు నమోదయ్యాయి. అతని మోసాలకు సంబంధించి మరిన్ని వివరాలు పోలీసులు తవ్వుకుంటున్నారు. ఇంత పక్కా ప్లాన్ తో దొంగతనాలు చేసే దొంగ పోలీసులకు చిక్కడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

ఈ వెరైటీ దొంగ కథనం చూస్తే, దొంగతనం చేసే వాళ్లలో కూడా ఎంత వెరైటీ ఉండొచ్చో అర్థమవుతుంది! అయితే, ఎంత ప్లాన్ చేసినా నేరం నేరమే. చివరికి చట్టం చేతికి చిక్కాల్సిందే!

## ట్రంప్ తీరుతో యువత జీవితం డిస్టర్బ్ అవుతుంది: సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ



హైదరాబాద్ పెన్ పవర్:అక్రమ వలసదారుల పట్ల అమెరికా ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును తీవ్రంగా ఖండించారు సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ. అమెరికా ప్రభుత్వ తీరుతో యువత జీవితం డిస్టర్బ్ అవుతోందని అన్నారు. అక్రమ వలసదారుల పేరుతో యువతను అమెరికా ప్రభుత్వం క్రూరమైన పద్ధతుల్లో జంతువులను, నేరస్తులను వేటాడుతున్న తీరులో ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ట్రంప్ ప్రభుత్వం వలస దారులను తిప్పి పంపే పేరుతో చాలా దుర్మార్గంగా వ్యవహరిస్తున్నదని పేర్కొన్నారు. ఈ మేరకు అమెరికా పార్లమెంటు ముందు నుంచి ఆదివారం ( ఫిబ్రవరి 23, 2025 ) ఉదయం ఒక వీడియో విడుదల చేశారు.ట్రంప్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కక్షగట్టినట్టు వలస దారులను జంతువుల తరహాలో వేటాడడాన్ని ఆక్షేపించారు.అక్రమ వలస దారులను తిప్పి పంపడాన్ని తాము వెతిరేకించడం లేదని పేర్కొన్నారు. భారత ప్రభుత్వం కూడా అమెరికాలో ఉన్న భారతీయ వలస దారులను వెనక్కు తీసుకుంటామని ప్రకటన చేసిందని గుర్తు చేశారు. అయితే ట్రంప్ ప్రభుత్వము వలస దారులని తిప్పి పంపడానికి ఎన్నుకున్న విధానాన్ని తీవ్రంగా తప్పుపడుతున్నామని అన్నారు. భారత ప్రధాని మోదీ అమెరికాకు వచ్చి ట్రంప్ తో చర్చలు జరిపిన మరుసటి రోజు నుంచి కూడా అదే రీతిలో జంతువులను వేటాడినట్టు వ్యవహరించడాన్ని తీవ్రంగా ఖండించారు.ఆమెరికలో ఉన్న వలస దారులు ఉన్నట్టుండి వచ్చిన వారు కాదని పేర్కొన్నారు. దశాబ్దకాలంగా అక్కడ ఉంటున్నారని తెలిపారు. వారిని వారి దేశాలకు పంపడానికి చేస్తున్న చర్యలు అభ్యంతరకరంగా ఉన్నాయన్నారు. అమెరికా ప్రభుత్వ తీరు యువత జీవితం డిస్టర్బ్ అవుతున్నదని పేర్కొన్నారు.వలస దారులను గుర్తించడం వారికి కొంత సమయం ఇచ్చి సుహృద్భావ వాతావరణంలో తిప్పి పంపే ఏర్పాటు చేసి ఉండాల్సిందని పేర్కొన్నారు. అలా కాకుండా యువతను వేధించి వెంటాడుతున్న తీరును ఖండిస్తున్నామని పేర్కొన్నారు.

## ప్లాన్ ప్రకారమే రాజలింగమూర్తి హత్య.. నిందితుల్లో మాజీ ఎమ్మెల్యే అనుచరుడు



హైదరాబాద్ పెన్ పవర్: తెలంగాణలో సంచలనంగా మారిన భూపాలపల్లి రాజలింగమూర్తి మర్డర్ కేసు మిస్టరీని పోలీసులు ఛేదించారు. ఈ కేసులో నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. అరెస్ట్ అయిన వారిలో భూపాలపల్లి మాజీ వైస్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి ప్రధాన అనుచరుడు కొత్త హరిబాబు పాత్ర ఉన్నట్లు ధృవీకరించారు. హరిబాబు ప్లాన్ ప్రకారమే రాజలింగమూర్తిని హత్య చేసినట్టు పోలీసులు తెలిపారు. రాజలింగ మూర్తిని చంపితే బెయిల్ నేనే తీసుకొస్తా.. మీ ఖర్చులన్నీ నేనే చూసుకుంటాని నిందితుడు హరిబాబు చెప్పినట్లు తెలుస్తోంది. దాదాపు 5 నెలలుగా పాటు ప్లాన్చేసి, హత్య చేసిన్న ట్లు సమాచారం. ఈ కేసులో ఏ8గా ఉన్న హరిబాబు ప్రస్తుతం పరారీలో ఉన్నాడు.అతన్ని అరెస్ట్ చేస్తే ఇంకొన్ని విషయాలు బయటికి వచ్చే అవకాశం ఉంది. భూపాలపల్లి రాజలింగ మూర్తి హత్య కేసుకు సంబంధించిన వివరాలను ఇవాళ ఎస్పీ కిరణ్ ఖరే మీడియాకు వివరించారు. రాజలింగమూర్తి హత్యకు భూ వివాదమే కారణమని తెలిపారు. ఎకరం భూమి కోసమే హత్యమార్చారని తెలిపారు. 'సంజీవ్, రాజలింగమూర్తి మధ్య భూ వివాదం కొనసాగుతోంది. పక్కా ప్లాన్ ప్రకారమే హత్య చేశారు. కంట్లో కారం కొట్టి కత్తులతో పొడిచి హతమార్చారు. ఈ హత్యలో నలుగురు వ్యక్తులు నేరుగా పాల్గొన్నారు. మిగతా వాళ్లు వారితో టచ్లో ఉన్నారు. బీఆర్ఎస్ నాయకుడు హరిబాబు ఈ హత్యకు ప్లాన్ చేసినట్లు గుర్తించాం. ప్లాన్ ప్రకారం వరంగల్లోని కాశీబుగ్గలో హత్యకోసం కత్తులు, రాడ్లను దుండగులు కొనుగోలు చేశారు. ఇతర కోణాల్లో కూడా పోలీసుల దర్యాప్తు కొనసాగుతుంది. ఇప్పటి వరకు ఈ హత్య కేసులో 10 మంది నిందితుల్లో ఏడుగురిని అరెస్ట్ చేశాం. హరిబాబుతో పాటు మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నారు. ఆరు బృందాలతో కలిసి పోలీసులు నిందితుల కోసం గాలింపు చర్యల్లో ఉన్నారు.' అని చెప్పారు. ఈ కేసులో %ా%1 రేణి గుంట్ల సంజీవ్.. హత్యకు ముందు, తర్వాత బీఆర్ఎస్ నాయకుడు హరిబాబుతో టచ్ ఉన్న ట్టు పోలీసులు నిర్ధారించారు. మాజీ ఎమ్మెల్యే సండ్రా వెంకటరమణారెడ్డికి హరిబాబు ప్రధాన అనుచరుడు. ఈ హత్య కేసుతో సంబంధం ఉన్న వారందరినీ అరెస్ట్ చేసి రిమాండుకు తరలించిన ట్లు ఎస్పీ తెలిపారు.

# బంగారం ధరలు మరింతగా పెరిగాయిగా... ఇక ఆగేట్లు లేవుగా

హైదరాబాద్ పెన్ పవర్:బంగారం ధరలు ఒకరోజు తగ్గితే పది రోజులు పెరుగుతుంటాయి. ధరలు మరింత ప్రియమవుతాయని ముందుగానే మార్కెట్ నిపుణులు చెబుతున్నప్పటికీ పెరిగిన ధరలను చూసి కొనుగోలుదారులు ఎవరూ ముందుకు రావడం లేదు. గతంలోలా ఇప్పుడు బంగారం ధరలు పెరిగితే కొనుగోలు చేయాలన్న ఆసక్తి చనిపోయిందని వ్యాపారులు చెబుతున్నారు. అత్యవసరమైతే తప్ప బంగారు దుకాణాల్లోకి అడుగుపెట్టడం లేదని వ్యాపారులు చెబుతున్నారు. వచ్చిన తక్కువలో తక్కువగా బంగారాన్ని కొనుగోలు చేస్తూ తమకు అవసరమైనంత మేరకే కొనుగోలు చేస్తున్నారు తప్ప, ఎగబడి కొనుగోలు చేయడం అనేది ఈ మధ్య కాలంలో జరగడం లేదని చెబుతున్నారు.




**కొనుగోళ్లు తగ్గి...**

ప్రధానంగా పెళ్లిళ్ల సీజన్ ప్రారంభమై అనేక రోజులు దాటింది. పెళ్లిళ్ల సీజన్ లో ఇంత దారుణంగా వ్యాపారాలు మునుపెన్నడూ జరగలేదని వ్యాపారులు చెబుతున్నారు. గత సీజన్ తో పోలిస్తే బంగారం కొనుగోళ్లు 70 శాతం మేరకు తగ్గిపోయాయని వ్యాపారులు చెబుతున్నారు. కొనుగోలు చేద్దామని వచ్చిన వారు సయితం ధరలను చూసి వెనక్కు వెళ్లిపోతున్నారు. ఈ సమయంలో కొనుగోలు చేస్తారని తాము ఎక్కువ స్టాక్ తెప్పించామని, కానీ అవి అమ్ముడు పోక షాపులోనే ఉండిపోయాయని తెలిపారు. ధరలు పెరగడానికి అనేక కారణాలున్నప్పటికీ ఈ ఏడాది ప్రారంభం నుంచి ధరలు పెరుగుతుండటంతో ఇక త్వరలోనే పది గ్రాముల బంగారం ధర లక్ష రూపాయలకు చేరుకుంటుందని అంచనాలు వినిపిస్తున్నాయి.

**బంగారం పెరిగి...**

బంగారం అంటే స్టేటస్ సింబల్ గా అందరూ గుర్తిస్తారు. ముఖ్యంగా మహిళలు ఎక్కువగా బంగారం కొనుగోళ్లపై ఆసక్తి కనపరుస్తారు. కానీ మహిళలు కూడా ధరలు చూసి ఆసక్తి కనపర్చకపోవడం వల్లనే కొనుగోళ్లు దారుణంగా పడిపోయాయి. ఈరోజు దేశంలో బంగారం ధరలు పెరిగాయి. వెండి ధరలు మాత్రం తగ్గాయి. పది గ్రాముల బంగారం ధరపై 320 రూపాయల వరకూ పెరిగింది. కిలో వెండి ధరపై 300 రూపాయలు తగ్గింది. ఉదయం ఆరు గంటలకు హైదరాబాద్ బులియన్ మార్కెట్ లో బంగారం, వెండి ధరలు ఇలా ఉన్నాయి. 22 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర 80,450 రూపాయలుగా ఉంది. 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర 87,770 రూపాయలుగా నమోదయింది. కిలో వెండి ధర 1,07,000 రూపాయలుగా ట్రెండ్ అవుతుంది. బంగారు దుకాణాలన్నీ వినియోగదారులు లేక ఖాళీగా కనిపిస్తున్నాయి.

# ఈ కారు పేరు జీరో... గాల్లో ఎగరడంలో ఇది హీరో!



హైదరాబాద్ పెన్ పవర్:ప్రపంచంలో ఇప్పటికే అభివృద్ధి దశలో ఉన్న ఫ్లయింగ్ కార్లు ఉన్నప్పటికీ... తాము రూపొందిస్తున్న కారు భిన్నమైందని చెబుతోంది అలెఫ్ ఏరోనాటిక్స్. ఇప్పటివరకూ ఉన్న ఫ్లయింగ్ ట్యాక్సీ వంటి కార్లు రోడ్డును రన్ వేలుగా ఉపయోగిస్తాయని.. కానీ, తాము అభివృద్ధి చేస్తున్న కారు (మోడల్ జీరో) రోడ్డుపై నిట్టనిలువుగా టేకాఫ్ తీసుకోగలదని చెబుతున్నారు.అవును... పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యలకు తోడు, టైం సేవింగ్స్ లో భాగంగా గత కొంతకాలంగా ఫ్లైయింగ్ టాక్సీలకు సంబంధించిన కథనాలు ప్రపంచ వ్యాప్తంగా హల్ చల్ చేస్తోన్న సంగతి తెలిసిందే. ఈ సమయంలో... అలెఫ్ ఏరోనాటిక్స్ సంస్థ ఆసక్తికరమైన ఫ్లయింగ్ కార్ అప్ డేట్స్ ఇచ్చింది. దీనికి సంబంధించిన వివరాలు వెల్లడించింది. తాజాగా ఈ కారును ప్రయోగాత్మకంగా కాలిఫోర్నియాలోని ఓ రోడ్డుపై సక్సెస్ ఫుల్ గా పరీక్షించింది. అందుకు సంబంధించిన వీడియోను విడుదల చేసింది. ఆ వీడియోలో ఈ కారు రోడ్డుపై కాస్త దూరం ప్రయాణించి ఆపై నిట్టనిలువుగా టెకాఫ్ అయ్యింది. అనంతరం ముందున్న కారుపై నుంచి ఎగురుతూ ముందుకు సాగింది. మళ్లీ రోడ్డుపై దిగి ముందుకు కదిలింది.

ఈ సందర్భంగా... సాధారణ కార్లలో బానెట్ లో ఇంజిన్ ఉంటే.. ఈ మోడల్ జీరో కారులో మాత్రం నాలుగు చిన్న ఇంజిన్లు వాటి వాటి చక్రాల వద్ద అమర్చినట్లు కంపెనీ తెలిపింది. వాటి సాయంతో సాధారణ ఎలక్ట్రిక్ కారులాగానే ఈ కారు రోడ్డుపై దూసుకెళ్తోంది. ఇక.. ఖాళీగా ఉన్న బానెట్, డిక్కీలలో ఎనిమిది ప్రొపెల్లర్లను ఏర్పాటు చేసింది.ఈ ఎనిమిది ప్రొఫెల్లర్ల ప్రత్యేకత ఏమిటంటే.. ఇవి వేటికవే వేరువేరు వేగాలతో పరిభ్రమించగలవు.. అందువల్ల కారు ఏ దిశలో అయినా ఎగరడం సాధ్యం అవుతోంది. పైగా... ఈ కారు ఫ్రేమ్ కోసం కార్బన్ ఫైబర్ వాడటంతో దీని బరువు 385 కిలోలకే పరిమితమైంది. ఇది సులువుగా ఎగరడానికి మరింత సాధ్యమవుతుందని చెబుతున్నారు.

ఇక... ప్రస్తుత మోడల్ జీరో నమూనా కారు గాల్లో సుమారు 177 కి.మీ. దూరం ప్రయాణించగా, రోడ్డుపై మాత్రం 56 కిలోమీటర్ల దూరం వెల్లగలదని అలెఫ్ ఏరోనాటిక్స్ వివరించింది. సాధారణ ప్రజలు ఈ కారును వాడటం ఎంతో సులభమని.. కేవలం పదిహేను నిమిషాల్లోనే కారులోని కంట్రోల్స్ పై పట్టు సాధించొచ్చని సీఈవో జిం డకోవ్నీ పేర్కొన్నారు.

ఇదే సమయంలో.. ధర విషయానికొస్తే... ఈ కంపెనీ ఇప్పటికే ప్రీ ఆర్డర్లు తీసుకుంటోంది. ఈ సమయంలో కారు ధరను సుమారు రూ.2.57 కోట్లుగా ఖరారు చేసింది. అయితే.. ఫ్యూచర్ లో భారీ స్థాయిలో ఉత్పత్తి చేపట్టి.. సామాన్యులకు అందుబాటు ధరల్లో ఉండేలా సుమారు రూ.27.35 లక్షలకు కారును అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపింది.

# భారత్‌ను ఓడించండి.. కోటి రూపాయలు బహుమతిగా ఇస్తా: సింధ్ గవర్నర్




హైదరాబాద్ పెన్ పవర్:ఛాంపియన్స్ ట్రోఫీ 2025: దాయాదుల పోరుపై సింధ్ గవర్నర్ ముహమ్మద్ కమ్రాన్ ఖాన్ టెస్సోరి ఓ బహిరంగ ప్రకటన చేశారు. దుబాయి గడ్డపై భారత్‌ను ఓడిస్తే, కోటి రూపాయలు బహుమతిగా ఇస్తానని పాకిస్తాన్ ఆటగాళ్లకు హామీ ఇచ్చారు. ఇది తానొక్కడి కోరిక కాదని, యావత్ దేశం అదే కోరుకుంటోందని టెస్సోరి ఆ జట్టు ఆటగాళ్లను ఉద్దేశించి మాట్లాడారు."భారత్‌పై పాకిస్తాన్ జట్టు గెలిస్తే, నా వైపు నుండి ఆటగాళ్లకు కోటి రూపాయలు ఇస్తానని నేను హామీ ఇస్తున్నాను. ఒకవేళ ఓడిపోతే వారిని పట్టించుకోము అని కాదు. ఆటగాళ్లే మన బలం, గౌరవం. వాళ్లు గెలిచినా, ఓడినా ఎప్పటికీ ఆధరిస్తాం. కానీ ఈసారి దేశం మొత్తం విజయం కోసం ప్రార్థిస్తోంది. మన వాళ్లు దానిని సాధిస్తారని గట్టిగా నమ్ముతున్నారు.."

"ప్రస్తుతానికి నేను లండన్‌లో ఉన్నాను, కానీ భారతదేశంపై పాకిస్తాన్ తలపడే ప్రతి మ్యాచ్‌లోనూ నా ప్రార్థనలు, గుండె చప్పుడు ఎప్పుడు పాకిస్తాన్‌తోనే.." అని టెస్సోరి %ూా% న్యూస్ ఇంటర్వ్యూలో అన్నారు.

**ఓ మాదిరి స్కోరు..**

ఇదిలావుంటే, కీలక పోరులో ఇప్పటికే దాయాది జట్టు ఇన్నింగ్స్ ముగిసింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న పాక్.. 49.4 ఓవర్లలో 241 పరుగుల వద్ద ఆలౌటైంది. సౌద్ షకీల్ (62బీ 76 బంతుల్లో 5 ఫోర్లు), కెప్టెన్ మహ్మద్ రిజ్వాన్ (46బీ 77 బంతుల్లో 3 ఫోర్లు) కీలక ఇన్నింగ్స్‌లు ఆడారు. ఇమామ్ ఉల్ హక్ (10), బాబర్ అజామ్ (23), సల్మాన్ అఘా (19), ఖుష్‌దిల్ షా (38) పరుగులు చేశారు. భారత బౌలర్లలో కుల్‌దీప్ యాదవ్ 3, హార్దిక్ పాండ్య 2, అక్షర్ పటేల్, రవీంద్ర జడేజా, హర్షిత్ రాణా తలో వికెట్ పడగొట్టారు.

# తెల్లారితే కొడుకు పెళ్లి.. గుండె పోటుతో తండ్రి మృతి

హైదరాబాద్ పెన్ పవర్: తెల్లారితే కొడుకు పెళ్లి.. బంధువులతో ఇల్లంతా సందడిసందడి నెలకొంది. ఇంట్లో శుభకార్యం కావడంతో కుటుంబ సభ్యులంతా పెళ్లి ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఇంతలోనే అర్ధరాత్రి పెళ్లి కొడుకు తండ్రి గుండెపోటుతో కుప్పకూలిపోయాడు. మంగళవాయిద్యాలతో కలకలలాడాల్సిన ఇల్లు.. తండ్రి మృతితో ఒక్కసారిగా శోకసంద్రంలో మునిగిపోయింది. సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలంలో జరిగిన ఈ ఘటన స్థానికంగా విషాదాన్ని నింపింది. రామక్కపేట గ్రామానికి చెందిన రాగుల సత్యనారాయణ గౌడ్ ఇటీవల తన పెద్ద కుమారుడు శ్రీనివాస్ కు రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావు పెట మండలం కొత్త పల్లి గ్రామానికి చెంది భావన అనే అమ్మాయితో వివాహం కుదిరింది. ఫిబ్రవరి 23న ఉదయం దుబ్బాక లోని ఓ ఫంక్షన్ హాల్ లో వివాహం జరగాల్సి ఉంది. శ్రీనివాస్ తండ్రి సత్యనారాయణ గౌడ్ అర్ధరాత్రి గుండెపోటుతో మృతి చెందడంతో ఇరు కుటుంబాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి. సత్యనారాయణ గత కొంత కాలంగా సిద్దిపేటలో నివాసం ఉంటున్నాడు. తన గృహంలో అర్ధరాత్రి గుండెపోటుతో మృతి చెందాడు.

## గంటలో పెళ్లి.. పెండ్లికొడుకును చితక్కొట్టిన దుండగులు



**హైదరాబాద్ పెన్ పవర్:**మరో గంటలో పెళ్లి..పేషియల్ కోసం సెలూన్ కు వెళ్లిన పెండ్లికొడుకును దారిలో కాపుకాచి పట్టుకొని చితకొట్టారు. పెండ్లికొడుకు అన్నను, ఇంకొంతమంది బంధువులపై దాడి చేశారు. అంతేకాదు..గొడవలో పిస్టల్ తో కాల్పులు జరిపి భయాందోళనకు గురి చేశారు. అనుకోకుండా వరుడిపై దాడితో కుటుంబ సభ్యులు, బంధువులు షాక్ తిన్నారు. మరో గంటలో పెళ్లి ఉండగా వరుడిని ఎందుకు కొట్టారు.. ఏంజరిగింది వివరాల్లోకి వెళితే..

ఉత్తరప్రదేశ్ లోని బరేలీకి చెందిన ముకుల్ గుప్తాపై సినిమా ఫక్కీలో దాడి జరిగింది. ముకుల్ గుప్తా పెళ్లి మరో గంటలో తాళికట్టే ముహూర్తం.. ఈలోపు ఫేషియల్ చేయించుకుందామని సెలూన్ కు వెళ్లాడు తిరిగి వస్తుండగా అతని ప్రత్యర్థులు ముకుల్ పై దాడి చేశారు. పిడిగుద్దుల వర్షం కురిపించారు. తీవ్రంగా గాయపర్చారు. ముకుల్ అన్న, ఇతర బంధవులను కూడా దారుణంగా కొట్టారు. అంతటితో ఆగక పిస్టల్ లో గాల్లోకి కాల్పులు జరిపి చంపుతామని బెదిరించారు. విషయం తెలుసుకొని సంఘటన స్థలానికి వచ్చిన పోలీసులపై కూడా రాళ్లు రువ్వి భయభ్రాంతులకు గురి చేశారు. ఈ వివాదానికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది.

పోలీసుల కథనం ప్రకారం.. బరేలీలోని అయోన్లా స్టేట్ బ్యాంక్ జంక్షన్ వద్ద గొడవ జరిగింది. ముకుల్ మెన్స్ పార్లర్ కు వెళ్లి వస్తుండగా అతని ప్రత్యర్థులు దాడి చేశారు. ఓ బైక్ పార్కింగ్ విషయంలో ముకుల్ కు మరో వర్గానికి జరిగిన వివాదం ముదిరి దాడి దారి తీసింది. బాధితుడు ముకుల్ సోదరుడు పోలీసులకు సమాచారం ఇవ్వగా అక్కడికి వచ్చిన పోలీసులపైనా రాళ్ల దాడి చేశారు దుండగులు. ఈఘటనపై సీరియస్ గా తీసుకున్న బరేలీ పోలీసులు మొత్తం 15 మంది నిందితులను అరెస్ట్ చేశారు.

### ఫిబ్రవరి 24 విజయ ఏకాదశి.. విష్ణుమూర్తికి అరటిపండ్లు సమర్పించండి..

## మంచి ఉద్యోగం వస్తుంది..కష్టాలు తీరుతాయి..





**హైదరాబాద్ పెన్ పవర్:**మాఘమాసం కృష్ణ పక్షం ఏకాదశికి విజయ ఏకాదశి అంటారు. మహాశివరాత్రికి ముందు వచ్చే ఏకాదశి. విజయ ఏకాదశికి చాలా విశిష్టత ఉందని పురాణాల ద్వారా తెలుస్తుంది. ఈ ఏడాది ఫిబ్రవరి 24 తేదీ సోమవారం విజయ ఏకాదశి జరుపుకొనున్నారు. విజయ ఏకాదశి వ్రతం పాటించి లక్ష్మీనారాయణులకు అరటిపండ్లను సమర్పిస్తే.. మంచి ఉద్యోగం లభించడంతో పాటు.. కష్టాలు తీరతాయని ఆధ్యాత్మిక వేత్తలు చెబుతున్నారు.

విజయ ఏకాదశి ( ఫిబ్రవరి 24 సోమవారం) ఉపవాస దీక్షను పాటించాలి. ఈ పవిత్రమైన రోజున లక్ష్మీనారాయణులను పూజిస్తే ప్రతి పనిలో విజయం సాధించడంతో పాటు.. మరణం తరువాత మోక్షం లభిస్తుందని పురాణాలు చెబుతున్నాయి. ఫిబ్రవరి 24 విజయ ఏకాదశి రోజున తెల్లవారుజామున నదిలో స్నానం చేయాలి. అవకాశం లేని వారు ఇంట్లో బావి వద్ద గాని.. కుళాయి వద్దగాని స్నానమాచరించాలి. స్నానం చేసేటప్పుడు కొద్దిగా గంగా జలంకాని..పుణ్య నదుల తీర్థం కాని కలుపుకుంటే మంచిదని పండితులు చెబుతున్నారు.

**పూజా విధానం**

ఇంట్లో పూజా పూజామందిరాన్ని శుభ్రం చేసి.. ఆవుపేడతో అలికి.. ముగ్గు పెట్టి.. పీట వేసి.. పసుపు వస్త్రం పరిచి లక్ష్మీనారయణుల పటాన్ని కాని.. విగ్రహాన్ని కాని ఉంచాలి. స్వామి దగ్గర ఆవునెయ్యితో కాని.. నువ్వుల నూనెతో కాని దీపారాధన చేయాలి. తరువాత పంచామృతాలతో అభిషేకం చేయాలి. తరువాత స్వామికి వస్త్రం కట్టి.. పసుపు.. కుంకుమ.. గంధం ... పూలతో పూజ చేయాలి. తులసి దళాలను స్వామి వారికి సమర్పించాలి. ధూపం వేసి. అరటి పండ్లను స్వామివారికి నైవేద్యంగా సమర్పించాలి.

స్వామి వారి పూజలో భాగంగా విష్ణు సహస్రనామాన్ని పారాయణం చేయాలి.. లక్ష్మీ దేవిని పూజించాలి. విజయ ఏకాదశి వ్రత కథను పారాయణం చేయాలి. "ఓం నమో భగవతే వాసుదేవాయ నమః" అనే మంత్రాన్ని పఠించాలి. విష్ణువుని భక్తి శ్రద్ధలతో పూజించడం వల్ల మోక్షం లభిస్తుందని పండితులు చెబుతున్నారు.

**విజయ ఏకాదశి ప్రాముఖ్యత**

విజయ ఏకాదశి వ్రతం ఆచరించిన వారికి ఎల్లప్పుడూ విజయం లభిస్తుంది. ఈ వ్రతం పాటించడం వల్ల పూర్వం రాజులు, చక్రవర్తులు చాలా యుద్ధాలలో విజయం సాధించినట్లు పురాణాలు చెబుతున్నాయి. ఉపవాసం ఆచరించి విష్ణువుని పూజించిన వారికి శత్రువులు ఎటువంటి పరిస్థితుల్లో కలిగించిన వాటి నుంచి బయటపడగలుగుతారు. బాధల నుంచి విముక్తి కలుగుతుంది. గత జన్మలో చేసిన పాపాల నుంచి విముక్తి లభిస్తుంది.

**ఏకాదశి రోజు పఠించాల్సిన మంత్రాలు**

ఓం నారాయణాయ లక్ష్మీ నమః... అనే మంత్రాన్ని 108 సార్లు పఠించడం వల్ల మంచి ఉద్యోగం పొందుతారు.

ఓం సీతాపతే రామ్ రామాయ నమః.. అనే మంత్రాన్ని జపించడం వల్ల మీ మనసులోని కోరికలన్నీ నెరవేరుతాయి.

ఓం నమో భగవతే వాసుదేవాయ నమః అనే మంత్రాన్ని పాటించడం వల్ల ఇంట్లో సుఖసంతోషాలు కలుగుతాయి.

**ఏకాదశి రోజు చేయాల్సిన పనులు**

విష్ణుమూర్తిని, లక్ష్మీదేవిని పూజించాలి.

రావి చెట్టు చుట్టూ ప్రదక్షిణలు చేయాలి.

ఉపవాసదీక్షను పాటించాలి.

విష్ణుమూర్తికి పసుపు, కుంకుమ, అరటిపండ్లు నైవేద్యంగా పెట్టడం వల్ల దాంపత్య సమస్యల నుంచి విముక్తి లభిస్తుంది.

ఆరోజు ( ఫిబ్రవరి 24) న వీలయినంతవరకు దానాలు చేయండి.

రోజంతా భగవత్ ధ్యానంలో గడపాలి..

కింద చాప కాని.. దుప్పటి కాని వేసుకొని పడుకోవాలి.

**ఏం చేయకూడదు**

విజయ ఏకాదశి నాడు అన్నం తినకూడదు.

అబద్ధాలు చెప్పకూడదు. ఇలా చేయడం వల్ల మీ జీవితంలో సమస్యలు మరింత పెరుగుతాయి.

సాత్విక ఆహారాన్ని ( పాలు.. పండ్లు) తీసుకోవాలి.

మాంసం, ఆల్కహాల్, ఉల్లిపాయలు, లేదా వెల్లుల్లి తీనకూడదు... ధూమపానం చేయకూడదు.

ఎవరిని కించపరచకూడదు.. అవమానించకూడదు.

ఏ జీవికి ఎలాంటి హాని తలపెట్టకూడదు.

మంచంపై కూర్చోకూడదు.. పడుకోకూడదు.

## ఎనిమిది మంది ప్రాణాలు ఇంకా టన్నెల్ లోనే.. బయటపడేదెప్పుడంటే?




**హైదరాబాద్ పెన్ పవర్:**శ్రీశైలం ఎడమ కాల్వ టన్నెల్ లో నిన్న ఉదయం 8.30 గంటలకు ప్రమాదం జరిగింది. మూడు మీటర్ల మేర పై కప్పు కూలింది. ఎనిమిది మంది కార్మికులు లోపల చిక్కుకున్నారు. దాదాపు ఇరవై గంటలుగా కార్మికులు టన్నెల్ లోనే చిక్కుకున్నారు. వారిని బయటకు తీసే ప్రయత్నాలకు అడుగడుగునా అడ్డంకులు ఏర్పడుతున్నాయి. టన్నెల్ లో మూడడగుల మేర నీరు నిలిచి ఉండటంతో పన్నెండు కిలోమీటర్ల మేరకు బురద పేరుకు పోయింది. ఎన్.డి.ఆర్.ఎఫ్, సింగరేణి రెస్క్యూ టీం ప్రయత్నిస్తున్నా వారి ప్రయత్నాలు ఫలించడం లేదు. రెస్క్యూ ఆపరేషన్ లో ఇండియన్ ఆర్మీ కూడా పాల్గొంటుంది. అయినా లోపల కి వెళ్లేందుకు నీరు అడ్డంకిగా మారుతుంది.

**నీటిని తొలగించేందుకు...**

నీటిని తొలగించేందుకు ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది ప్రయత్నిస్తున్నారు. బురద నీటిని తొలగించేంత వరకూ చిక్కుకుపోయిన వారిని రక్షించే అవకాశం లేదని ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది చెబుతున్నారు. పథ్నాలుగు కిలోమీటర్లు లోపలకి వెళ్లినా కార్మికుల జాడ కనిపించలేదు. లోపలకు వెళితే నెట్ వర్క్ పనిచేయడం లేదు. అయితే ఆ ప్రాంతానికి ఆక్సిజన్ అందుతుందా? లేదా? అన్నది కూడా అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అందుకే ఆక్సిజన్ ను టన్నెల్ లోపలకు పంపించేందుకు ప్రయత్నిస్తున్నారు.అడ్డంకులు అధిగమించి చిక్కుకుపోయిన కార్మికుల వద్దకు చేరుకోవాలంటే మరో నాలుగు గంటల సమయం పడుతుందని ఎన్డీఆర్ఎఫ్ సిబ్బందిచెబుతున్నారు.

**నీరు ఆహారం లేకుండా...**

మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావుతో పాటు ఉన్నతాధికారులు అక్కడే ఉండి సహాయక చర్యలు పర్యవేక్షిస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా ఎప్పటికప్పుడు పరిస్థితిని అడిగి తెలుసుకుంటున్నారు. కార్మికులను రక్షించడానికి అవసరమైన అన్ని ఎఫెర్ట్స్ పెట్టాలని అధికారులను, మంత్రులను ముఖ్యమంత్రి ఆదేశించారు. దాదాపు ఇరవై గంటల నుంచి టన్నెల్ లో ఉండటంతో వారికి నీరు ఆహారం లేక ఎలాంటి పరిస్థితుల్లో ఉన్నారో అర్థం కాకుండా ఉందని తెలిపారు. వారు బయటకు వచ్చిన క్షణమే ఆసుపత్రికి తరలించేందుకు అంబులెన్స్ లను సిద్ధంగా ఉంచారు. మరికొద్ది గంటల్లోనే కార్మికులు బయట పడే అవకాశముంది. అయితే కార్మికుల కుటుంబాల్లో ఆందోళన వ్యక్త మవుతుంది. ఎనిమిది మంది ప్రాణలు టన్నెల్ లో చిక్కుకుపోవడంతో శక్తి వంచన లేకుండా సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు.

# భార్య గొంతుకోసి చంపేశాడు.. భర్తను పట్టించిన సోషల్ మీడియా ఫొటోలు



**హైదరాబాద్ పెన్ పవర్:**పథకం ప్రకారం హత్య.. భార్యపై అనుమానం పెంచుకున్న భర్త..కుంభమేళాకు తీసుకెళ్లి అక్కడే ఆమెను దారుణంగా చంపేశాడు. అమ్మ ఏదీ నాన్న అని అడిగిన పిల్లలకు కుంభమేళాలో తప్పిపోయిందని నమ్మబలికాడు. అయితే నిందితుడు సోషల్ మీడియాలో పెట్టిన ఫొటోలు అతని బండారం బయటపెట్టాయి. వివరాల్లోకి వెళితే.. ఢిల్లీలోని త్రిలోక్ పురికి చెందిన 48యేళ్ల అశోక్ కుమార్, మీనాక్షి భార్యభర్తలు. మీనాక్షి మరొకరితో వివాహేతర సంబంధం పెట్టుకుందని అశోక్ కుమార్ కు అనుమానం. అది పెనుభూతమై ఇద్దరి మధ్య గొడవలు మొదలయ్యాయి. చివరికి హత్యకు దారి తీశాయి. భార్యను ఎలాగైన హత్య చేయాలనుకున్న అశోక్ కుమార్.. భార్యను కుంభమేళాలో చంపేసి తప్పిపోయిందని చెపితే అందరూ నమ్ముతారని ప్లాన్ వేశాడు. అనుకున్న ప్లాన్ ప్రకారం.. ఫిబ్రవరి 17న ఢిల్లీ నుంచి ప్రయాగ్ రాజ్ కు భార్యభర్తలు వచ్చారు. ఝూన్సీలో ఓ రూం అద్దెకు తీసుకున్నారు. కుంభమేళాకు వచ్చినట్లు ఫొటోలు దిగి సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు అశోక్ కుమార్. అదే రాత్రి మీనాక్షి గొంతు కోసి హత్య చేసి బాత్ రూంలో పడేసి అక్కడి నుంచి పారిపోయాడు. ఏమీ తెలియనట్లు ఢిల్లీకి వెళ్లాడు.. అమ్మ ఏదీ నాన్న అని పిల్లలు అడిగితే కుంభమేళాలో తప్పిపోయిందని నమ్మబలికాడు. మరుసటి రోజు బాత్రూంలో మృతదేహాన్ని గుర్తించిన ఇంటి ఓనర్ పోలీసులకు సమాచారం ఇచ్చాడు. మీనాక్షి మృతదేహాన్ని రికవరీ చేసి పోస్ట్ మార్టమ్ పంపారు. అయితే కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన పోలీసులకు ఆమె ఎవరేది ఎలా గుర్తించాలో కష్టంగా మారింది. అయితే అశోక్ కుమార్ సోషల్ మీడియాలో పెట్టిన పోస్టులే పోలీసులకు ఆధారమయ్యాయి. అశోక్ కుమార్ ఫొటోలను సోషల్ మీడియాలో, పేపర్లలో ప్రచురించారు. అశోక్ కుమార్ ను అరెస్ట్ చేసిన పోలీసులకు విచారణలో సంచలన విషయాలు తెలిశాయి. మూడునెలలుగాభార్యను చంపేందు కు ప్రయత్నించానని..భార్యపై అనుమా నంతో పథకం ప్రకారమే కుంభమేళాకు తీసుకెళ్లి గొంతుకోసి హత్య చేశానని నిందితుడు ఒప్పుకున్నాడు.

# ఆరోగ్యశ్రీకి మంగళం.. ఏపీలో కొత్త పథకం రెడీ




**హైదరాబాద్ పెన్ పవర్:**ఆంధ్రప్రదేశ్ లో ఆరోగ్య శ్రీ పథకానికి ప్రభుత్వం స్వస్తి చెప్పేందుకు సిద్ధమయింది. ఈ మేరకు ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ఆరోగ్యశ్రీ ప్రభుత్వ ఖజానాకు భారంగా మారడంతో ఈనిర్ణయం తీసుకుంటున్నట్లు గతంలోనే చంద్రబాబు అధికారులతో జరిగిన సమావేశంలో ప్రస్తావించారు. అందరికీ ఉచిత బీమా సౌకర్యం కల్పిస్తే ఖజానాపై భారం తగ్గుందని, తద్వారా బీమా కంపెనీలు ఇచ్చే సొమ్ముతో ప్రజారోగ్యాన్ని పరిరక్షించవచ్చని చంద్రబాబు భావించారు. ఈ మేరకు ఆయన ఆరోగ్య బీమా అమలు చేసేందుకు సిద్ధమయ్యారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాం నుంచి ప్రారంభమైన ఆరోగ్య శ్రీ పథకం బాగా పాపులర్ అయింది. అయితే దానివల్ల కార్పొరేట్ ఆసుపత్రులకు ఏటా వందల కోట్ల రూపాయలు చెల్లించాల్సి రావడంతో ఇబ్బందిగా మారింది.

**ఖజానాకు భారంగా మారడంతో...**

ప్రస్తుతం కొత్తగా ఏర్పాటయిన కూటమి ప్రభుత్వానికి ఆరోగ్య శ్రీ తెల్లఏనుగులా తయారైంది. ప్రజల్లో బాగా పాపులర్ అయిన ఈ పథకాన్ని తొలగించాలా? వద్దా? అన్న దానిపై చాలా వరకూ సమాలోచనలు జరిపి ఏ రకంగానైనా ప్రజారోగ్యాన్నికాపాడుకోవాడానికి మరొక కొత్త పథకంతో ముందుకు వస్తే తప్ప ఈ భారం నుంచి బయటపడలేమని చంద్రబాబు భావించారు. దీనికి సంబంధించిన ప్రతిపాదనలు కూడా అధికారులు సిద్ధం చేశారు. అంతా ఓకే అయితే ఏప్రిల్ నెల నుంచి ఆరోగ్య శ్రీ స్థానంలో ఆరోగ్య బీమా పథకం అమలులోకి వచ్చే అవకాశముంది. అయితే బీమా కంపెనీలు క్లెయిమ్ ల విషయంలో ఆలస్యం చేయకుండా కూడా ముందుగానే ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకుంటుంది.

**ఆరుగంటల్లోనే క్లెయిమ్...**

కేవలం ఆరు గంటల్లోనే క్లెయిమ్ అయ్యేలా బీమా కంపెనీలకు చంద్రబాబు క్లియర్ కట్ గా ఆదేశించారు. అయితే ఏపీని రెండు యూనిట్లుగా విభజించాలని నిర్ణయించారు. శ్రీకాకుళం జిల్లా నుంచి కృష్ణా జిల్లా వరకూ ఒక యూనిట్ గా, గుంటూరు నుంచి మిగిలిన జిల్లాలను మరొక యూనిట్ గా గుర్తించనున్నారు. ఈ రెండు యూనిట్లకు వేర్వేరుగా టెండర్లు పిలిచి బీమా కంపెనీలను ఆహ్వానిస్తారు. ఎన్టీఆర్ ట్రస్ట్ కింద ఏడాదికి 25 లక్షల వరకూ ఉచిత చికిత్సలను అందిస్తున్నట్లుగానే ఈ ఉచిత బీమాతో కూడా ఏడాదికి ఇరవై ఐదు లక్షల వరకూ ఇవ్వాలని ప్రాథమికంగా నిర్ణయించారు. ఆదాయంతో సంబంధం లేకుండా అందరికీ ఉచిత బీమా వర్తింప చేసేలా చర్యలు తీసుకునే అవకాశముంది. ఏడాదికి రెండున్నర లక్షల మేరకేఉచితంంగా వైద్య సేవలు అందుతాయి. ఆపైన అవసరమైతే ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా అందించాలని నిర్ణయించారు. మరి బీమా కంపెనీలు ఈ కొత్త విధానంలో ప్రజలను ఏ మేరకు సంతృప్తి పరుస్తాయి? ఇబ్బంది పెడతాయన్నది చూడాల్సి ఉంది. దీనికి సంబంధించి చంద్రబాబు అధికారికంగా నిర్ణయం తీసుకుంటే ఏప్రిల్ నుంచి కొత్త ఉచిత బీమా పథకం ఏపీలో అమలు కానుంది.

# నా భర్త హత్యకు కేసీఆర్, హరీశ్ రావే కారకులు: రాజలింగమూర్తి భార్య సరళ



**హైదరాబాద్ పెన్ పవర్:**తన భర్త హత్యకు కేసీఆర్, కేటీఆర్, హరీశ్, మాజీఎమ్మెల్యే గండ్ర వెంకటరమణా రెడ్డే కారణమని ఆరోపించారు రాజలింగమూర్తి భార్య సరళ. భూపాలపల్లిలో మీడియాతో మాట్లాడిన ఆమె.. గండ్ర వెంకట రమణ రెడ్డిఈ హత్యకు తనకు సంబంధం లేదని చెప్పారు. ఇపుడు ఆయన ప్రధాన అనుచరుడే హత్యకు సూత్రదారుడిగా ఉన్నారని చెప్పారు. దీన్ని బట్టే హత్య వెనుక ఎవరెవరి హస్తం ఉందో అర్థమవుతుందన్నారు. చిన్న భూమి తగాద విషయంలో తన భర్త హత్య జరగలేదన్నారు సరళ . భూమి విషయంలో హత్య జరిగితే ఈ కేసులో ఎలాంటి సంబంధం లేని కొత్త హరిబాబు ప్రమేయం ఎందుకు ఉందన్నారు. మేడిగడ్డ ప్రాజెక్టులో జరిగిన అక్రమాలపై కేసు వేసినందుకే తన భర్తను హత్య చేశారని ఆరోపించారు. తన భర్త హత్య కేసు నమోదు సమయంలో తాను ఇచ్చిన సమాచారం వేరు, పోలీసులు నమోదు చేసుకున్నది వేరని చెప్పారు. సీబిసిఐడి దర్యాప్తు బృందం చేత హత్య కేసు విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు సరళ. గండ్ర వెంకటరమణా రెడ్డి, కొత్త హరిబాబులకు ఉరి శిక్ష వేసి తమ కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు.

ఈ కేసులో నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. అరెస్ట్ అయిన వారిలో భూపాలపల్లి మాజీ వైస్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి ప్రధాన అనుచరుడు కొత్త హరిబాబు పాత్ర ఉన్నట్లు ధృవీకరించారు. హరిబాబు ప్లాన్ ప్రకారమే రాజలింగమూర్తిని హత్య చేసినట్టు పోలీసులు తెలిపారు. రాజలింగమూర్తిని చంపితే బెయిల్ నేనే తీసుకొస్తా.. మీ ఖర్చులన్నీ నేనే చూసుకుంటాని నిందితుడు హరిబాబు చెప్పినట్లు తెలుస్తోంది. దాదాపు 5 నెలలుగా పాటు ప్లాన్వేసి, హత్య చేసిన్న ట్లు సమాచారం. ఈ కేసులో ఏ8గా ఉన్న హరిబాబు ప్రస్తుతం పరారీలో ఉన్నాడు. అతన్ని అరెస్ట్ చేస్తే ఇంకొన్ని విషయాలు బయటికి వచ్చే అవకాశం ఉంది.

# ఆస్తి కోసం అన్నను కొట్టి చంపిన చెల్లెళ్లు


**హైదరాబాద్ పెన్ పవర్:**మనుషులు రోజు రోజుకు క్రూరంగా మారుతున్నారు. బందాలు, అనుభందాలు ఇవేమీ లెక్కచేయడం లేదు. ఆస్తి కోసం అన్నాచెల్లెల్లు, అన్నదమ్ములు ఒకరినొకరు కొట్టుకుని చంపుకుంటున్నారు. లేటెస్ట్ గా ఇద్దరు అక్కాచెల్లెల్లు అన్నను కొట్టి చంపారు. ఈ ఘటన తెలంగాణలోని జగిత్యాల జిల్లాలో జరిగింది.జగిత్యాల జిల్లా కేంద్రం పోచమ్మ వాడలో ఆస్తి తగదాలతో అన్నపై ఇద్దరు చెల్లెళ్లు కర్రలతో దాడి చేశారు. దీంతో తీవ్ర గాయాలైన జంగిలి శ్రీనివాస్ ను ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న శ్రీనవాస్ ఫిబ్రవరి 23న మృతి చెందాడు. ఇద్దరు చెల్లెలు శారద, వరలక్ష్మి కర్రలతో దాడి చేశారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు జగిత్యాల పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితులిద్దరు పట్టణ పోలీస్ స్టేషన్ లో లొంగిపోయారు.

# అమెరికా మెచ్చిన..కేరళ చట్టి.. ఇది కేరళ కల్లు దుకాణానికి లగ్జరీ వెర్షన్ !

**హైదరాబాద్ పెన్ పవర్:**అది ప్రపంచ ప్రసిద్ధ నగరం.. న్యూయార్క్. చీకటి పడ్డాక ఆ నగరమంతా చల్లగా ఉంటుంది. అలాంటి టైంలో వేడి వేడిగా ఏదైనా స్పైసీ ఫుడ్ తినాలి అనుకునేవాళ్లకు బెస్ట్ చాయిస్ చట్టి. ఈ రెస్టారెంట్‌లోకి వెళ్లగానే కేరళలోని కల్లు దుకాణాల్లో కనిపించే కొరమీను పొల్లిచాతు, మలబార్ మటన్ ఘుమఘుమలు వెల్‌కమ్ చెప్తాయి. ఇకపోతే ఇంటీరియర్ కోసం లాటరైట్ బ్రిక్స్, టేక్ వుడ్‌ని కన్నూర్ నుంచి ట్రాన్స్‌పోర్ట్ చేయించి మరీ వాడారు. అందుకే చూడడానికి అచ్చం ఇండియన్ స్టైల్‌లో ఉంటుంది. అందులో కూర్చుని తింటుంటే.. కేరళలో కూర్చుని తిన్నట్టే అనిపిస్తుందని దాని ఫౌండర్ చెఫ్ రెజి మ్యాథ్యూ చెప్తున్నాడు.

ఇండియన్ చెఫ్ రెజి మ్యాథ్యూ న్యూయార్క్‌లో పెట్టిన 'చట్టి' రెస్టారెంట్‌లో వండే ప్రతి వంటకం కేరళ కిచెన్ నుంచి వెళ్లిందే. అందుకోసం మ్యాథ్యూ ఎంతో రీసెర్చ్ చేశాడు. కేరళ కల్లు దుకాణాల్లో దొరికే ఫుడ్ మాత్రమే అందులో ఉంటుంది. కేరళలోని కల్లు దుకాణాల్లో ఉపయోగించే గుండ్రని మట్టి కుండలను మలయాళంలో 'చట్టి' అని పిలుస్తారు. అందుకే దానికి ఆ పేరు పెట్టారు. సాధారణంగా కేరళలోని కల్లు దుకాణాల్లో 'టచింగ్స్' చాలా ఫేమస్. వాటిని కేరళ బార్ శ్నాక్స్ అని కూడా పిలుస్తుంటారు. ఈ శ్నాక్స్‌ని చిన్న చిన్న ప్లేట్లలో సర్వ్ చేస్తుంటారు. అచ్చం అవే వంటకాలను, అలాంటి చిన్న ప్లేట్స్‌లోనే అమెరికాలోని చట్టిలో సర్వ్ చేస్తున్నారు.

చట్టిలోని యాంబియెన్స్ కూడా కేరళనే గుర్తు చేస్తుంది. పెద్ద గాజు కిటికీలు, ఆకుపచ్చని పైకప్పు.. కేరళలోని ఇండ్ల ముందు ఉండే పచ్చని వాతావరణాన్ని గుర్తు చేస్తుంది. ఫర్నిచర్‌ని నిలంబూర్ టేకుతో తయారు చేశారు. అది కూడా సంప్రదాయ భారతీయ ఫర్నిచర్ లానే ఉంటుంది. గోడలను ఇండియా నుంచి తీసుకెళ్లిన రాగి కట్ కుడ్య చిత్రాలతో అలంకరించారు. చట్టిలో ఒకేసారి 80 మంది కూర్చుని తినొచ్చు. ఇందులోనే ప్రైవేట్ పార్టీ ప్లేస్, ప్రైవేట్ బార్ కూడా ఉన్నాయి. చెన్నై, బెంగళూరు నుండి వెళ్లిన చెఫ్‌లే చట్టిలో వంట చేస్తున్నారు. ఆ వంటలను స్థానిక వెయిటర్లు సర్వ్




చేస్తున్నారు.

**కేరళ కల్లు దుకాణం నుంచి..**

కేరళ వీధుల్లో ప్రతి సాయంత్రం కొబ్బరి చెట్టు నుంచి తాజాగా తీసిన కల్లు అమ్ముతుంటారు. అయితే.. అక్కడి పల్లెల్లోని కల్లుతోపాటు శ్నాక్స్ కూడా బాగా ఫేమస్. ఊరికో స్పెషల్ వంటకం ఉంటుంది. ముఖ్యంగా సీ ఫుడ్ ఎక్కువగా తింటుంటారు. వాటిలో హైపర్‌లోకల్ ఇంగ్రెడియెంట్స్‌తో చేసే వంటకాలే ఎక్కువ. అవన్నీ అక్కడి ఇండ్లలోని కిచెన్‌లో పుట్టినవే. అందుకే కొందరు ఫ్యామిలీతో వచ్చి మరీ వాటిని తింటుంటారు. అచ్చం అలాంటి ఆతిథ్యాన్ని అమెరికా వాసులకు కూడా అందించాలనే ఉద్దేశంతోనే మ్యాథ్యూ చట్టి రెస్టారెంట్‌ని పెట్టాడు. ఇది కేరళ కల్లు దుకాణానికి లగ్జరీ వెర్షన్ అయినప్పటికీ ఫార్మాట్ ఒకటే.

కల్లు దుకాణంలో కల్లు తాగుతూ శ్నాక్స్ తింటూ.. మాట్లాడుకుంటారు. చట్టిలో కల్లుకు బదులుగా ఎలిఫెంట్ విస్పరర్ తాగొచ్చు. చట్టి మెనూలోని ఇంట్రెస్టింగ్ డ్రింక్స్‌లో ఎలిఫెంట్ విస్పరర్ ఒకటి. కేరళలోని ఏనుగులు, వాటి సంరక్షకుల మధ్య బంధానికి నివాళిగా ఒక డ్రింక్‌కి ఆ పేరు పెట్టారు. దాన్ని అరటిపండు ప్యూరీ, కొబ్బరి, ప్రొసెక్కో కలిపి తయారుచేస్తారు. సామ్ బార్ ( సాంబార్ ఇన్‌స్పిరేషన్‌తో ఈ పేరు పెట్టారు. ఈ పేరుతో ఒక డాక్యుమెంటరీ ఫిల్మ్ కూడా ఉంది.) అనేది ఒక వోడ్కా కాక్‌టెయిల్. అయ్యో కాఫీ.. ఫిల్టర్ కాఫీని ఉపయోగించి తయారు చేసే క్లాసిక్ ఎస్ప్రెస్సో ఇది.

ఇవే కాకుండా సోన్ఫ్, వెల్లుల్లి, మిరపకాయలు వేసి ఒక ప్రత్యేకమైన ఫ్లేవర్‌తో త్రివేండ్రం చికెన్ ఫ్రై తయారు చేస్తారు. బోర్డర్ చికెన్ ఫ్రైలో తాజా మిరియాల పొడి వేస్తారు. మసాలాలు, చింతపండుతో చేసే కొబ్బరి క్లామ్స్ కూడా ఇక్కడి స్పెషల్ ఎట్రాక్షన్. వీటితోపాటు కొరమీను ఫ్రై, ప్రాన్ పొచెస్, టాడీ షాప్ బీఫ్ ఫ్రై, బీఫ్ డ్రై ఫ్రై, మలబార్ మటన్, కర్ర పెండెలం ఫ్రై ఇక్కడ ఎక్కువగా తింటుంటారు. ఈ రెస్టారెంట్‌కి ప్రపంచం నలుమూలల నుంచి వచ్చిన అన్ని రకాల ప్రజలు వస్తుంటారు. అందుకే వాళ్లందర్నీ దృష్టిలో పెట్టుకుని, అందరూ మెచ్చే వంటకాలను షార్ట్‌లిస్ట్ చేసి, వాటినే అందుబాటులోకి తీసుకొచ్చారు. చట్టి టీం ఇంగ్రెడియెంట్స్‌ని కూడా నేరుగా కేరళ రైతుల నుంచే కొనుగోలు చేస్తుంటుంది. వాయనాడ్‌లోని పుల్పల్లి నుండి మిరియాలు, మరయూర్ నుండి బెల్లం, మున్నార్ నుండి టీ ఆకులు, ఎర్నాకుళంలోని గృహిణుల టీం నుంచి కోల్డ్–ప్రెస్డ్ కొబ్బరి నూనె కొంటున్నారు.

**ఎంతో రీసెర్చ్..**

న్యూయార్క్‌కి కేరళ సంస్కృతి, సంప్రదాయ ఫుడ్‌ని పరిచయం చేయాలనే ఉద్దేశంతో ఈ రెస్టారెంట్‌ని పెట్టాడు మ్యాథ్యూ. అయితే.. అంతకుముందే ఆయనకు కేరళ, తమిళనాడులో రెస్టారెంట్లు నడిపిన అనుభవం ఉంది. ఆ అనుభవంతోనే అమెరికాలో ఈ స్టార్టప్ పెట్టాడు. ఆయన గతంలో బెంగళూరు, చెన్నైలలో పెట్టిన 'కప్పా చక్కా కంధారి' అనే రెస్టారెంట్ స్టార్టప్ ఎంతోమంది విమర్శకుల ప్రశంసలు పొందింది. ఆయన ఆ రెస్టారెంట్ పెట్టడానికి ముందు చాలా రీసెర్చ్ చేశాడు. కేరళ అంతటా 300కి పైగా ఇళ్లు, 100 కల్లు దుకాణాలకు వెళ్లి.. 800కి పైగా వంటకాలను రుచి చూశాడు. ప్రాంతీయ వంటకాల్లోనే బెస్ట్ రెసిపీలను ఎంపిక చేసి వాటితోనే కప్పా చక్కా కంధారిని ఏర్పాటు చేశాడు. అయితే.. ఆయన ప్రయాణంలో ప్రతి గ్రామం అంతెందుకు వీధికో వెరైటీ టేస్ట్ చూశాడు. ప్రజలు సులభంగా లభించే హైపర్‌లోకల్ పదార్థాతో రెసిపీలు తయారుచేస్తారు. కాబట్టి ఒక ప్రాంతంలో దొరికే ఫుడ్ మరో ప్రాంతానికి కొత్తగానే అనిపిస్తుంటుంది. ఒకే వంటకం ఒక్కో ప్రాంతంలో ఒక్కో టేస్ట్ ఉంటుంది. వాటిలో ఏ వేరియెంట్ ఎంచుకోవాలి అనేది నిర్ణయించుకోవడానికి మ్యాథ్యూ మరింత రీసెర్చ్ చేయాల్సి వచ్చింది. ఆ టైంలో తెలుసుకున్న వంటకాలనే చట్టి మెనూలో తీసుకొచ్చాడు.

**వంట.. సైన్స్**

చెఫ్ మ్యాథ్యూ కెమిస్ట్రీలో గ్రాడ్యుయేషన్ చేశాడు. ఆ తర్వాత ఐహెచ్‌ఎంసీటీ అండ్ ఏఎన్‌లో హోటల్ మేనేజ్‌మెంట్, క్యాటరింగ్ టెక్నాలజీ చదివాడు. అంతేకాదు.. ఎక్స్‌ఎల్‌ఆర్ఐ, జంషెడ్‌పూర్ నుండి బిజినెస్ మేనేజ్‌మెంట్‌లో పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా పూర్తి చేశాడు. ఆయన "వంట ఒక కళ మాత్రమే కాదు. అది ఒక సైన్స్. ముందు వేసిన పదార్థం తర్వాత వేసిన దానికి ఉత్ప్రేరకంగా పనిచేస్తుంది" అంటాడు. అందుకే మ్యాథ్యూ ఎప్పుడూ వంట చేయడం అంత చిన్న విషయమేమీ కాదు" అని చెప్తుంటాడు.

# శివరాత్రి స్పెషల్: ముల్లోకాల దేవుడు.. శివుడి జన్మ రహస్యం ఇదే..!

**హైదరాబాద్ పెన్ పవర్:**హిందువులు శివుడిని ఆరాధిస్తారు. శివరాత్రి రోజు ( ఫిబ్రవరి 26).. దాదాపు ప్రతి శివాలయంలో పరమేశ్వరుడికి అభిషేకం.. కళ్యాణం నిర్వహిస్తారు. ఆ పరమేశ్వరుడిని ముల్లోకాలలో పూజిస్తారు. ప్రతి లోకానికి ఆది.. అంతం రెంటిని కూడా పరమేశ్వరుడు చూస్తాడని శివ పురాణంలో వివరించారు. శివయ్య ముందు ఏశక్తి అయినా పటా పంచలు కావాల్సిందే.. అసలు పరమేశ్వరుడు ఎవరు..? ఆయన ఎలా జన్మించాడు.. ఆయన తల్లిదండ్రులు ఎవరు? గురువు ఎవరు? ఇలాంటి విషయాలను ఈ స్టోరీలో తెలుసుకుందాం.

పురాణాల ప్రకారం.. ఒకానొక సమయంలో బ్రహ్మ, విష్ణు మధ్య రాక్షసుల బాధలు ఎక్కవయ్యాయి. చాలా బాధలు పడుతున్నాం.. దైవ కన్యలను అవమానపరుస్తున్నారు. వీరి ఆగడాలను ఎలా అరికట్టాలి.. అనే విషయంలో బ్రహ్మ, విష్ణువు ఇద్దరు చర్చించుకుంటున్నారు. అలా వారిద్దరు మాట్లుడుకుంటుండగా హఠాత్తుగా మండుతున్న అగ్నిగోళంలా మహాదేవుడు వారి మధ్యకు వచ్చాడని బ్రహ్మ పురాణంలో ఉంది. ఆయన రావడంతోనే ఓ పెద్ద శబ్దంవచ్చింది. ఆ అగ్నిగోళం ఒక పెద్ద స్థంభంగా ఏర్పడింది. అప్పుడు పరమేశ్వరుడు మీరిద్దరు గొప్పవారు కదా.. ఈ స్థంభానికి అంతం ఎక్కడుందో కనుక్కోండి.. ఇక మీదట వారే గొప్పవారుగా చెలామణి అవుతారని పరమేశ్వరుడు వారితో అన్నాడు.

అప్పుడు వెంటనే బ్రహ్మ ఒక పక్షి రూపం తీసుకున్నాడు. ఆ స్తంభానికి దారి కనుక్కోవడానికి బయలుదేరతాడు.




మరోవైపు విష్ణువు వరాహ రూపం ధరించి స్తంభానికి అంతం ఎక్కడుందో కనుక్కోవడానికి బయలుదేరాడు. చాలా సేపు వెతికాక వారిద్దరికీ స్తంభానికి అంతం ఎక్కడుందో కనిపించలేదు. ఇద్దరూ వెనక్కి వచ్చారు. ఆ తర్వాత శివుడు తన అసలు రూపంలో వారిద్దరికీ కనిపించాడు. దీంతో బ్రహ్మ, విష్ణువులు ఇద్దరూ శివుడే గొప్పవారని నిర్ధారణకు వస్తారు. ఇంతకుమించిన శక్తి ఎవరి దగ్గర లేదు. ఈ స్తంభం కథ శివుని జన్మ గురించి కానీ శివుని అంతం గురించి కానీ తెలియజేయలేదు. అందుకే శివుడిని స్వయంభువుడు అంటారు. శివుడికి అంతమే లేదని అంటారు.మరో పురాణ కథ ప్రకారం బ్రహ్మ దేవుడు శివుడికి తండ్రి అనే నమ్మేవారు చాలా మంది ఉన్నారు. శివుడు బ్రహ్మ దేవుడి పుత్రుడిగా ఎలా మారాడో బ్రహ్మ పురాణంలో ఉంది. బ్రహ్మ దేవుడు సృష్టి కర్త.. అలా సృష్టిని రచించేటప్పుడు... బ్రహ్మకు ఒక పిల్లవాడు అవసరమయ్యాడు. అప్పుడు బ్రహ్మదేవుడు ప్రార్థించగానే ....శివుడు అతని ఒడిలో చిన్న పిల్లాడిలా ప్రత్యక్షం అవుతాడు. బ్రహ్మ దేవుడు ఆ చిన్నారి శివుడి ఏడుపు వినగానే ఎందుకు ఏడుస్తున్నావ్ అని అడిగాడు. అప్పుడు ఆ చిన్నారి తనకు ఏ పేరూ లేదని చెప్తాడు. అప్పుడు బ్రహ్మ అతనికి రుద్ర అని పేరు పెడతాడు. రుద్ర అంటే ఏడ్చేవాడు అని అర్థం. ఆ తర్వాత కూడా శివుడు ఏడుపు మానలేదు. దీంతో బ్రహ్మ వేరే పేరు పెడతాడు. అప్పుడు కూడా శివుడు ఏడుపు ఆపడు. శివుడు ఏడుపు ఆపేందుకు అతనికి 108 పేర్లు పెడతాడు. అలా బ్రహ్మదేవుడు శివుడికి పెట్టిన 108 పేర్లను భూమిపై రాసిపెట్టినట్లు శివ పురాణం చెప్తోంది.

శివపురాణం ప్రకారం శివుడిని స్వయంభువుడు అంటారు. అంటే అతని పుట్టుక స్వయంగా జరిగింది. తల్లీతండ్రి లేరు. శివయ్యకు మరణం కూడా లేదు. విష్ణు పురాణంలో శివుని పుట్టుక గురించి చెప్పుకుందాం. విష్ణువు నుదుటి నుంచి వెలువడే కిరణాల నుంచి శివుడి పుట్టుక జరిగింది. భూమి, ఆకాశం, పాతాళం నీటిలో మునిగిపోయినప్పుడు విష్ణువు మినహా మరో ప్రాణి ఈ లోకంలో జీవించి లేదు. అప్పుడు విష్ణువు ఒక్కడే తన శేషతల్పంపై తేలుతూ ఉన్నాడు. ఆ తర్వాత అతని నాభి నుంచి బ్రహ్మ జన్మించాడు. విష్ణువు, బ్రహ్మ విశ్వం గురించి మాట్లాడుకుంటున్న సమయంలో శివుడి ప్రస్తావన వచ్చింది. బ్రహ్మ దేవుడు అతన్ని గుర్తించడానికి నిరాకరించాడు. దీంతో శివుడు అలిగాడు. విష్ణువు ...శివుడికి దివ్యదృష్టి ప్రసాదించి బ్రహ్మ దేవుడికి శివుడి గురించి గుర్తుచేసాడు. ఆ తర్వాత బ్రహ్మ తన తప్పు తెలుసుకుని క్షమాపణలు కోరాడు. తన తప్పును సరిచేసుకోవడానికి తన కుమారుడి రూపంలో పుట్టాలని ఆశీర్వదిస్తాడు. దీంతో శివుడు బ్రహ్మ కోరిక మేరకు ఆయన కడుపున పుడతానని మాటిస్తాడు.